# నీవు నేర్పిన విద్యయే...

-జి.ఎస్.మూర్తి

"పోస్ట్" అంటూ పోస్టుమాన్ ఒక కవరిచ్చి వెళ్లిపోయాడు. ఆత్రంగా ఆ ఉత్తరాన్ని అందుకుని చదవసాగింది సుశీల. ఆ ఉత్తరం ఢిల్లీ నుంచి ఆమె పిన్ని సత్యవతి, బాబాయ్ రామచంద్రయ్యల దగ్గరనుంచి వచ్చింది. వాళ్లిద్దరూ ఎల్లుండి వస్తున్నట్టు వ్రాసిన ఉత్తరం అది. అది చదివిన సుశీలకు చెప్పలేని ఆనందం కలిగింది. వాళ్లొస్తే తనకు ఎక్కడలేని ధైర్యం వస్తుందనుకుంది.

సుశీల చిన్నప్పటినుంచీ ఆమె పిన్ని, బాబాయ్‌ల దగ్గర ఢిల్లీలో పెరిగింది. అక్కడే చదువుకుంది కూడా. ఆమె పిన్ని, బాబాయ్‌లకు పిల్లలు లేకపోవడంతో సుశీల తల్లిదండ్రులు ఆమెను చిన్నప్పుడే వాళ్లింటికి పంపించివేసారు. ఆమె పిన్ని సుశీలను కన్నబిడ్డలా చూసుకునేది. ఇక బాబాయ్‌కి సుశీలంటే ఎంతో అభిమానం. వాళ్ల దగ్గర ఎమ్ఏ దాకా చదివిన తరువాత సుశీలకు మంచి సంబంధం చూసి పెళ్లి చేసారు.

పెళ్లికొడుకు సుబ్బారావు విశాఖపట్నంకు దగ్గరలోని పల్లెలో టీచర్. ఇద్దరికీ ఈడూజోడూ బాగా కుదరడంతో ఏ సమస్యా లేకుండా వారి వివాహం సజావుగా జరిగిపోయింది. పెళ్లయిన తరువాత రామచంద్రయ్య, సత్యవతిలిద్దరూ దగ్గరుండి ఆ పల్లెటూరిలో వాళ్లచేత కాపురం పెట్టించారు. ఒక నెల్లాళ్లపాటు వాళ్లతోనే వుండి సంసారంలో అన్ని మెలకువలు వాళ్లకు చెప్పి తిరిగి ఢిల్లీ వెళ్లిపోయారు. సుబ్బారావు మంచివాడేగానీ బాగా బద్ధకస్తుడు. అతనికి స్కూల్లో పాఠాలు చెప్పడం తప్ప ఇంటి దగ్గర ఏ పనీ చేయడు. అన్ని పనులూ సుశీల చేసుకోవాల్సిందే. ఇంటికి కావాల్సిన వెచ్చాలు దగ్గర్నుంచి బట్టలు ఉతకడం దాకా అన్నీ ఆమే చేసుకోవాలి. తను ఉద్యోగం చేస్తున్నాడు కాబట్టి ఇంటి పనులు తనకు చెందవనీ అతని ప్రగాఢ విశ్వాసం. ఇంటి పని అంటే ఆడవాళ్లదే అని అతని భావన.

తెల్లవారు లేచింది మొదలు ఆ ఇంట్లో సుశీలకు క్షణం తీరికుండదు. అప్పటికి ఆమె తెల్లవారు నాలుగుగంటలకే లేస్తుంది. స్నానాదులు, పూజ ముగిసిన తరువాత ఆమె దినచర్య ప్రారంభమవుతుంది. అతనికి బ్రష్ మీద పేస్ట్ వేసిందగ్గర్నుంచీ స్నానానికి వేడినీళ్లు పెట్టేదాకా అన్నీ ఆమే చేయాలి. ఈలోగా కాఫీ, పేపర్ అన్నీ వరుసగా అందించాలి. చివరికి అతని తలకు నూనె కూడా ఆమే రాయాలి. అతనికి రోజూ మల్లెపూవుల్లాంటి బట్టలు సిద్ధం చేయాలి. ఇక మధ్యాహ్నం స్కూలునుంచి వచ్చిన తరువాత భోజనం అవగానే కాసేపు నిద్రపోతాడు. అప్పుడు పవలింపు సేవ అంటే అదే కాళ్లు నొక్కడం చేయాలి. మళ్లీ సాయంత్రం నుంచి పనుల హడావుడి. ఇక రాత్రి మంచం మీదకు చేరే సరికి పదిగంటలవుతుంది. ఇలా సంవత్సరం తిరిగేసరికి సుశీల చిక్కి శల్యమయింది. సుబ్బారావుకి ఎప్పుడూ తనూ, తన స్కూలు తప్ప ఆమె గురించిన ధ్యాసే లేదు. సుశీల మొదట్లో ఏదో కొత్త కాపురం అని సర్దుకున్నా రానురాను వెగటు పుట్టింది. పెళ్లయి సంవత్సరం దాటుతున్నా అతనిలో మార్పు రాలేదు.

ఇక లాభం లేదనుకుని ఒక శుభోదయాన సుశీల తన బాధల్ని ఏకరువు పెడుతూ పిన్ని బాబాయ్‌లకు ఒక సుదీర్ఘ ఉత్తరం వ్రాసింది. సరిగ్గా అప్పటికి నెలరోజుల క్రితమే రామచంద్రయ్య పదవీ విరమణ చేసి ఇంట్లో హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆ సమయంలో వచ్చిన ఈ ఉత్తరాన్ని చూసి ఆ దంపతులు తాము వెంటనే బయలుదేరుతున్నట్లు ఉత్తరం వ్రాసారు. చిన్నప్పటినుంచీ తన జీవితాన్ని వాళ్లే తీర్చిదిద్దారు. ఈ సమస్యను కూడా వాళ్లే పరిష్కరిస్తారన్న నమ్మకంతో వుంది సుశీల. అనుకున్నట్లుగానే వాళ్లిద్దరూ రెండురోజుల తరువాత వచ్చారు.

***

రామచంద్రయ్య, సత్యవతి దంపతులు ఇంటికి వచ్చి రెండురోజులైంది. ఈ రెండురోజుల్లో వాళ్లు సుబ్బారావు ప్రవర్తనని, సుశీల కష్టాలను నిశితంగా పరిశీలించారు. ఆ తరువాత ఏం చేస్తే సుబ్బారావులో మార్పు వస్తుందో ఒక యాక్షన్ కమిటీని తయారు చేసారు. వారంరోజుల తరువాత దానిని అమలు చేయడం ప్రారంభించారు. వాళ్లు సుశీలని పిలిచి ఏం చేయాలో, ఎలా చేయాలో విడమరచి చెప్పారు. ఆమె దాన్ని క్రమశిక్షణతో అమలు జరిపితే సుబ్బారావులో మార్పు తథ్యం అని చెప్పారు. సుశీల దానికి సరేననడంతో ఆ మర్నాటి నుంచే దాన్ని అమలు చేయడం ప్రారంభించారు.

ఆ రోజు ఉదయాన్నే లేచిన సుబ్బారావుకి సుశీల బ్రష్ అందివ్వలేదు. దానికి కారణం ఆమె మంచంమీద నుంచి లేవలేదు.

ఆమెను లేపుతుంటే సత్యవతి చెప్పింది "అమ్మాయికి తలనొప్పి నాయనా. లేచే పరిస్థితి లేదు. ఈపూట నువ్వు టిఫిన్ బయట చేసి స్కూలుకు వెళ్లు'' అంది.

సుబ్బారావు ఇక తప్పదనుకుని తనే బ్రష్ తీసుకుని స్నానానికి నీళ్లు పెట్టుకుని అన్నీ ముగించుకుని స్కూలుకెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికొచ్చేసరికి సత్యవతి వంట చేయడం గమనించాడు. ఏదో నాలుగు ముద్దలు తిన్నాననిపించి మళ్లీ స్కూలుకు వెళ్లిపోయాడు.

రాత్రి కూడా అంతే. అలా రెండురోజులు గడిచిన తరువాత సుశీలకు కొద్దిగా తగ్గింది. అయినా సుబ్బారావు పనులేవీ ఆమె చేయడం లేదు. సుశీల ఎక్కువగా కష్టపడితే మళ్లీ జ్వరం వస్తుందని, అందుకని కొన్నాళ్లు ఆమెకు విశ్రాంతి అవసరమని చెప్పడంతో ఇక తప్పక అతను ఆ పనులన్నీ తనే చేసుకోవడం మొదలుపెట్టాడు. ఇప్పుడు సుశీల ఎక్కువసేపు మంచం మీదే గడుపుతోంది. వారంరోజుల్లో సుబ్బారావు తన పనులన్నీ తనే చేసుకోవడానికి అలవాటుపడ్డాడు.

కానీ అతను సుశీలకు తగ్గితే మళ్లీ ఆ పనులన్నీ ఆమే చేస్తుందన్న ఆశతో ఉన్నాడు. మరో రెండురోజుల తరువాత రామచంద్రయ్య 'ఆపరేషన్ ఉపవాసం' అమలు చేయడం ప్రారంభించాడు. ఇదీ వాళ్ల వ్యూహంలో భాగమే. దాని ప్రకారం సుశీల వారంలో సోమవారం, బుధ, శుక్ర, శనివారాలు ఉపవాసం వుంటుంది. పెళ్లయిన ఆడవాళ్లు అలా చేస్తే వాళ్లు కోరిన కోరికలు తప్పక తీరుతాయని చెప్పడంతో సుశీల దానికి ఒప్పుకుంది. ఉపవాసం నాడు ఆమె పచ్చి గంగ కూడా ముట్టదు కాబట్టి సుబ్బారావు పనులేవీ ఆమె చేయడం కుదరదు. అదీగాక ఉపవాసం ఉన్న వాళ్ల చేత పనులు చేయించుకుంటే పాపం చుట్టుకుంటుంది అని చెప్పడంతో సుబ్బారావుకి ఇంకో మాట మాట్లాడే అవకాశమే లేకపోయింది.

సుబ్బారావుకి రామచంద్రయ్య, సత్యవతి మీద పీకలదాకా కోపం వచ్చింది. వాళ్లు ఎంత త్వరగా ఇక్కడి నుండి వెళ్లిపోతారా అని ఎదురు చూస్తున్నాడతను. వాళ్లు ఇక్కడున్నన్నాళ్లు తనకి కష్టాలు తప్పవు. రోజుకో కొత్త పథకాన్ని ప్రవేశపెడుతూ తనకి నరకాన్ని చూపిస్తున్నారనుకున్నాడు. కానీ తన భార్యకు వాళ్లు దగ్గరవాళ్లు కావడంతో ఏమీ చేయలేక మిన్నకుండిపోయాడు.

నెలరోజులు గడిచాయి. ఆపరేషన్ ఉపవాసం గ్రాండ్ సక్సెస్ అయింది. ఇప్పుడు సుబ్బారావు తన పనులన్నీ హాయిగా తనే చేసుకుంటూ స్కూలుకు వెళ్తున్నాడు. ఇంక అల్లుడు దారిలో పడ్డట్టే అని నిర్ధారించుకున్న రామచంద్రయ్య దంపతులు తాము వచ్చిన పని పూర్తయిందని భావించి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

***


ఏ ముహూర్తాన ఆమె పిన్ని బాబాయ్‌లు వచ్చారో అప్పట్నుంచీ తన కష్టాలు తీరిపోయాయి. ఇప్పుడు సుబ్బారావులో బాగా మార్పు వచ్చింది. ఆ ఆనందంలో అన్ని విషయాలు వివరిస్తూ వాళ్లకు ఉత్తరం వ్రాసింది సుశీల.

**ప్రియమైన పిన్ని బాబాయ్‌లకు,**

మీ కూతురు సుశీల నమస్కరించి వ్రాయునది. మీరు ఇక్కడకు రావడంవల్ల నా బాధలన్నీ తీరిపోయాయి. ఇప్పుడు ఆయన బాగా మారిపోయారు. అప్పుడప్పుడు నాకే జాలివేసి అతని పనులన్నీ నేను చేస్తానన్నా అతను చేయనివ్వడంలేదు. అతనిలో ఈ మార్పుకు కారణం మీరే. ఈ క్రెడిట్ మీకే దక్కుతుంది.ఈసారి వేసవి సెలవులకు మేమిద్దరం ఢిల్లీకి వస్తాము. మరి నేను వుంటాను.

**ఇట్లు**
**సుశీల**

ఆ ఉత్తరం పోస్టుచేసిన తరువాత ఆమెకు ఎంతో ఆనందం కలిగింది. చిన్నప్పటి నుంచీ తన జీవితాన్ని వాళ్లే తీర్చిదిద్దారు. అందుకు వాళ్ల పట్ల కృతజ్ఞతతో ఆమె మనస్సు నిండిపోయింది.



కానీ పదిరోజుల తరువాత రామచంద్రయ్య దగ్గర్నుంచీ తిరుగుటపాలో ఉత్తరం వచ్చింది.

**"ప్రియమైన సుశీలకు,**

మీ బాబాయ్ ఆశీర్వదించి వ్రాయునది. నీ ఉత్తరం ఈ రోజే అందింది. విషయాలు చదివి ఆనందించాను. కానీ మీ ఊరు నుంచి ఇక్కడకు వచ్చిన తరువాత నీ సమస్య నాకొచ్చి పడింది. నీకు ఏదైతే చెప్పానో మీ పిన్ని అవన్నీ తాను ఆచరిస్తూ నామీదే ప్రయోగిస్తోంది. నీకు చిన్నప్పటినుంచీ నా సంగతి తెలుసు. నా పనులన్నీ మీ పిన్నే చూసుకునేది. కానీ నీ భర్తని కట్టడి చేయడానికి నీకు చెప్పిన కిటుకులన్నీ తాను ఆచరిస్తూ ఆ పనులన్నీ ఈ వయసులో నాచేత చేయిస్తోంది. ఈ వృద్ధాప్యంలో అవన్నీ నేను చేసుకోలేక అష్టకష్టాలు పడుతున్నాను. ఇలా నేను ప్రయోగించిన బాణం నాకే తగులుతుందని నేనెప్పుడూ ఊహించలేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే 'నీవు నేర్పిన విద్యయే' అని పద్యం పాడుతోంది. ఏదైనా నీ సమస్యను పరిష్కరిద్దామని మీ ఇంటికి రావడంవల్ల నీకు మోదం, నాకు ఖేదం మిగిలాయి. చూద్దాం! ఏదొచ్చినా మన మంచికే అంటారు. ఉంటాను.

**మీ బాబాయ్**
**రామచంద్రయ్య**

ఆ ఉత్తరం చదివిన సుశీల అవాక్కయింది.

★